
సాక్షి ఒడిశా
గురువారం । 14 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.9,14,563లు, బంగారం 14 గ్రాముల 800 మిల్లీగ్రాములు వెండి 194 గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్సాహంగా బాల వైజ్ఞానిక ప్రదర్శన

మహేంద్రగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది.

- 9లో



ఉత్సాహంగా క్రీడా పోటీలు

పర్లాకిమిడిలోని సరస్వతీ శిశు విద్యామందిర్‌లో 35వ వార్షిక క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పోటీలు జరుగుతాయి.

- 9లో

న్యూస్‌రీల్

పర్లాకిమిడిలో కార్తికేయ స్వామి పూజలు



పూజలందుకున్న కార్తికేయ స్వామి

పర్లాకిమిడి: కార్తీక మాసం సందర్భంగా స్థానిక పెద్దబ్రాహ్మణ వీధి దిగువున కార్తికేయ స్వామి మహోత్సవం బుధవారం ప్రారంభమైంది. వారం రోజులు ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహక కమిటీ అధ్యక్షులు బసంత పండా తెలిపారు. తొలిరోజు పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి చంద్రగిరి ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో హెచ్‌ఎం మనోరమ దాస్‌కు జిల్లా విద్యాశాఖ మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బసంతకుమార్ నాయక్ నోటీసులో పేర్కొన్నారు.

సృజన-3.0 క్రీడోత్సవాలు ప్రారంభం



క్రీడలనను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ఎన్.వి.జె.రావు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో సృజన-3.0 పేరిట క్రీడోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.వి.జె.రావు ముఖ్యఅతిథిగా క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. విశ్వవిద్యాలయం క్రీడా విభాగం అధికారి రవీంద్రకుమార్ పండా, ఆశీష్ తివారీ పాల్గొన్నారు. డిసెంబర్ నెలాఖరు వరకు క్రీడా పోటీలు కొనసాగుతాయి.

న్యాయవాదులకు ఎమ్మెల్యే సంఘీభావం



న్యాయవాదుల శిబిరం వద్ద ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి : న్యాయవాది పత్తి రామారావుపై యాసిడ్ దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదుల చేపట్టిన దీక్షకు బుధవారం ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి సంఘీభావం తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు చేపట్టిన నిరసన ఆందోళన ఈ నెల 16 వరకూ కొనసాగిస్తామని న్యాయవాది హీరాచంద్ తెలిపారు. అప్పటి వరకూ కేసులు వాదించకుండా విధులను బహిష్కరిస్తామని చెప్పారు.

విద్యార్థులకు పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సరస్వతి సాహు

రాయగడ: బాలల దినోత్సవం సందర్భంగా రాయగడలోని మహిళ సేవా సమాజ్ కార్యాలయ ప్రాంగణంలో విద్యార్థులకు ముగ్గులు, నృత్య పోటీలు నిర్వహించారు. విజేతకుల బహుమతులు అందజేశారు. సేవాసమాజ్ మహిళలు విద్యార్థులకు ఉచితంగా పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షురాలు సుజాత పాలో, సరస్వతి సాహు తదితరులు పాల్గొన్నారు.


వక్తృత్వ పోటీలు..

సాయిప్రియనగర్‌లో సాయిప్రియ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సామాజిక బాధ్యత-విద్యార్థుల కర్తవ్యం అన్న అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో ఎస్.దక్షిత ప్రథమ, హార్దిక్ మీనా ద్వితీయ, ప్రత్యూష రౌత్ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ట్రస్ట్ కార్యదర్శి దయానిధి ఖడంగ, సభ్యులు మహేశ్వత పాణిగ్రాహి, గీతారాణి మిశ్రా, ప్రతిమా పాడి, మనోజ్‌కుమార్ సాహు బహుమతులను అందజేశారు.

ప్రకృతి సోయగం



పర్యాటకుల సందడి



రాత్రివేళ సంబరాలు

ఓ వైపు జాలువారే జలపాతాలు.. మరోవైపు మనోహరమైన పర్వతాలు.. ఇంకోవైపు పరవశింపజేసే తోటలు.. ఇలా ప్రకృతి అందాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కొరాపుట్‌కు పర్యాటకుల తాకిడి మొదలైంది. ఏటా శీతాకాలం సీజన్‌లో రాష్ట్రం నుంచే కాకుండా దేశవిదేశాల నుంచి పర్యాటకులు తరలివచ్చి ప్రఖ్యాత దేవమాలి పర్వతం, పుట్‌శీల్, పుంజ సీల్, శబరి శ్రీ క్షేత్రం, డుడుమా జలపాతం, రాణీ డుడుమా జల పాతం, గుప్తేశ్వరం క్షేత్రం, బంతిపూల తోటలు తదితర ప్రాంతాలను తిలకిస్తారు. అనేక చోట్ల ఫైర్ క్యాంప్‌తో బస ఏర్పాటు చేసుకుంటారు. సిమిలిగుడ, కొరాపుట్, జయపూర్ ప్రాంతాల్లో హోటళ్లకు డిమాండ్ పెరిగింది.

– కొరాపుట్



అడుగడుగునా సూర్య బంతి తోటలు



దేవమాలి పర్వతంపై క్యాంప్‌ఫైర్

మంచంపై రోగి తరలింపు!



నీటిలో నుంచి మంచంపై ప్రతిమా ఖీలోను తరలిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: కష్టంలో ఉన్న వృద్ధురాలుకి అంతకు మించిన కష్టం వచ్చింది. మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి గోవిందపల్లి పంచాయతీ గోజియగూఢ గ్రామానికి చెందిన వృద్ధురాలు ప్రతిమా ఖీలో (61) కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కుటుంబీకులు బుధవారం నిర్ణయించారు. అయితే వీరు ఉంటున్న గ్రామం నుంచి గోవిందపురం ఆరోగ్య కేంద్రానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. అలాగే గ్రామానికి సమీపంలో ఓ వంతెన పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రతిమా ఖీలోను ఓ మంచంపై పడుకోబెట్టి కుటుంబ సభ్యులు మోసుకుంటూ.. వంతెన వద్ద మోకాలులోతు నీటిలో నడుస్తూ ఐదు కిలో మీటర్ల దూరంలో గోవిందపల్లి ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. కాగా వంతెన నిర్మాణ పనులు ఆరేళ్లుగా చేస్తున్నప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని, వంతెనను పూర్తి చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పాత రెవెన్యూ కాలనీలో ఆక్రమణల తొలగింపు



జేసీబీ సహాయంతో ఇళ్లను తొలగిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక జిల్లా కేంద్రాస్పత్రి వెనుక పాత రెవెన్యూ కాలనీలో ఆక్రమణలను బుధవారం తొలగించారు. తహసీల్దార్ ప్రియదర్శిన స్వయి, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సామర్య రంజన్ మిశ్రా, ఐఐసీ కమలాకాంత్ కుహరో ఆధ్వర్యంలో తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. కొన్నాళ్లుగా రెవెన్యూ కాలనీలోని ప్రభుత్వ క్వార్టర్(ఇళ్లు)లను కొంతమంది ఆక్రమించుకుని ఉండటం గమనించిన జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం స్పందించి ఆక్రమణలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసారు. దీంతో బుధవారం పోలీస్ బందోబస్తుతో యంత్రాల సహాయంతో ఇళ్లను తొలగించారు. కాగా, సుమారు 16 ఇళ్లను తొలగించడంతో నిరాశ్రయులైన బాధితులు తమకు పునరావాసం కల్పించాలనియ అధికారులను కోరారు. కట్టుబట్టలతో పిల్లాపాపలతో ఎక్కడ తలదాచుకొవాలని ప్రశ్నించారు. దీంతో తహశీల్దార్ స్పందిస్తూ జాగా మిషన్ పథకానికి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం తరఫున పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు గోడు వినిపిస్తున్న నిరాశ్రయులు



పోలీస్ బందోబస్తు

8 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అధ్యక్షతన బుధవారం లోక్ సేవాభవన్‌లో నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో 8 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. వీటిలో మత్స్య, పశు వనరుల శాఖకు చెందిన 5 ప్రతిపాదనలు ఉన్నాయని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా మీడియాకు వివరించారు.

- పశు సంరక్షణ అభివృద్ధి పథకం కింద ఐదేళ్లలో రూ.1,031 కోట్లు వెచ్చిస్తారు. దీంతో 3 లక్షల మందికి పైగా లబ్ధి చేకూరనుంది. రోజుకు 5 లక్షల గుడ్లు, 95.58 మెట్రిక్ టన్నుల కోడిమాంసం ఉత్పత్తి అవుతోంది.
- గోమాత పథకంలో భాగంగా మత్స్య శాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మూడేళ్లలో రూ.449 కోట్లు వెచ్చిస్తారు. దీనిలో భాగంగా రానున్న మూడేళ్లలో రూ.342 కోట్లు వెచ్చిస్తారు. ఏటా 2.5 కోట్ల వ్యాక్సిన్లు, 1.30 కోట్ల పశువులకు వైద్యం అందనుంది.
- జల వనరుల అభివృద్ధి కింద రూ. 9,652 కోట్లు వెచ్చించనున్నారు. దీనిలో భాగంగా 6,435 హెక్టార్ల పంట పొలాలకు సాగు నీరు, లక్షా 58 వేల హెక్టార్ల పంట పొలాలకు అదనపు సాగు నీరు అందజేస్తారు. ప్రభుత్వ ఉద్యోగ భర్తీ పరీక్షల ప్రక్రియలో అక్రమాలు, అవినీతి నిరోధించేందుకు ఒడిశా ప్రభుత్వ పరీక్షలు (అక్రమాల నివారణ) చట్టం – 2024 ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదించింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియాలో పారదర్శకతకు ఈ చట్టం దోహదపడుతుందని మంత్రి మండలి అభిప్రాయపడింది. ఈ చట్టం కింద అక్రమాలకు పాల్పడిన వారికి 3 నుంచి 5 ఏళ్ల ఖైదు, రూ. 10 లక్షల జరిమానా విధించనున్నారు.

ఉన్మాది దాడిలో వ్యక్తి మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుక్కు



రామ కిరసాని మృతదేహం

కొరాపుట్: ఉన్మాది దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి టికరపడ గ్రామంలో చోటుచేసుకుంది. సాధు బొడనాయక్ అనే వ్యక్తి విచిత్రంగా ప్రవరిస్తూ తన ఇంటికి వచ్చిన బంధువు, కంద్రి గ్రామానికి చెందిన రామ కిరసాని, అతని కుమారుడు సక్కు బొడ నాయక్‌లపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో రామ కిరసాని (30) అక్కడికక్కడే మృతి చెందాడు. సుక్కుకు తీవ్ర గాయాలు కావడంతో నందపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొరాపుట్ ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. నిందితుడు సాధును గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అప్పటికే సాధు కూడా కత్తితో తనకు తాను గాయపరుచుకోవడంతో పోలీసులు నందపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముగ్గురు పోలీసులకు గృహమంత్రి దక్షత పతకం

భువనేశ్వర్ : రాష్ట్రంలో నేర పరిశోధన రంగంలో విశేష దక్షత ప్రదర్శించిన ముగ్గురు పోలీసు అధికారులకు కేంద్ర గృహ మంత్రి దక్షత పతకం – 2024 లభించిందని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ వై.బి. ఖురానియా బుధవారం ప్రకటించారు. ఏటా అక్టోబరు నెల 31న సర్దార్ వల్లభ భాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఈ పతకం విజేతల్ని ప్రకటిస్తుందని, ఈ ఏడాది రాష్ట్రం నుంచి గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి సబ్యసాచి మల్లా, గంజాం జిల్లా అసికా పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి రాజేంద్రనాయక్ పట్నాయక్, మల్కన్‌గిరి పోలీసు స్టేషన్ ఇనస్పెక్టర్ ఇన్‌చార్జి రీగన్ కిండో ఉన్నారు.

ముగిసిన దీపారాధన ఉత్సవాలు





దీపాలతో మహిళలు (ఇన్‌సెట్లో) దీపారాధనోత్సవంలో పాల్గొన్న సప్తగిరి, సత్యజిత్

రాయగడ: కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని గుణుపూర్ బగువ మైదానంలో ఈ నెల 8 నుంచి ప్రారంభమైన కోటి దీపారాధనోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. సుమారు పదివేల మంది మహిళలు దీపాలను వెలగిస్తూ మైదానంలో శివనామస్మరణ చేశారు. కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో, మున్సిపల్ చైర్‌పర్సన్ మమత గౌడొ, వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడొలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉలక మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం అందరిపైనా ఉందన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భావితరాలకు మార్గదర్శంగా నిలుస్తాయని చెప్పారు.

క్లుప్తంగా

చర్యలు విరమించుకోవాలి



జయపురంజాయింట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వాణి, చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు

జయపురం: జయపురం న్యూ వాసవీ జ్యుయలర్స్ షాపుపై సిటీ, జీఎస్టీ అధికారులు దాడులు నిర్వహించి తలపెట్టిన చర్యలను విరమించుకోవాలని షాపు యజమాని పి.హరప్రసాదరావు భార్య వి.వాణి కోరారు. ఒడిశా సీటీ, జీఎస్టీ కమిషనర్ యామిణి షాడంగికి, జయపురం సిటీ, జీఎస్టీ జాయింట్ కమిషనర్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ జయపురం అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి జీ.మాధవతో కలిసి బుధవారం వినతిపత్రాలు అందజేశారు. గత నెల 29వ తేదీన సిటీ, జీఎస్టీ అధికారులు న్యూ వాసవి జ్యువలర్స్ షాపుపై దాడులు నిర్వహించటంతో మనస్థాపానికి గురై 31వ తేదీన గుండుపోటుతో షాపు యజమాని పి.హరప్రసాదరావు మరణించిన విషయాన్ని వినతిపత్రంలో పేర్కొన్నారు. హరప్రసాద్‌పై పెట్టిన అన్ని ప్రొసీడింగ్స్‌ను, పెనాలీలు, లైబలిటీస్‌ను రద్దు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అష్ట ప్రహరీ



భజన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ సమితి కె.సీతాపురం, సరా గ్రామాల్లో కార్తీక మాసం సందర్భంగా అష్టప్రహరీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల సాయమ్మ, ఉపాధ్యక్షులు రఘురాం సాహు, బీజేడీ బ్లాక్ అధ్యక్షులు అఖిల పాత్రో, సర్పంచ్‌లు హాజరయ్యారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్



పట్టుబడిన నిందితుడు

జయపురం: స్థానిక లింగరాజ్‌నగర్‌లో పూజ చేసేందుకు వచ్చిన విజయలక్ష్మీ రథ్ అనే మహిళ నుంచి మూడు తులాల బంగారు గొలుసును ఇద్దరు దుండగులు మంగళవారం తెంచుకుపోయారు. వీరిలో ఒకరు బైక్‌పై పారిపోగా.. ఒకరు పట్టుబడ్డాడు. నిందితుడిని స్తంభానికి కట్టేసి విచారణ చేయగా కవుడొంబు సాహి సుభాష్ హరిజన్‌గా గుర్తించారు. పోలీసులు వచ్చి సుభాష్‌ను అరెస్టు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లా లక్ష్యం

శ్రీకాకుళం క్రైమ్ : పెను సవాల్‌గా మారిన మత్తుపదార్థాల వినియోగాన్ని తిప్పికొట్టాలని, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సిబ్బందికి పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నిర్వాహకులు, ప్రతినిధులతో కలిసి సమీక్ష నిర్వహించారు. చిన్నపిల్లలు, మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయని, వీటిని అరికట్టాలన్నారు. విద్యాసంస్థల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌ను నియంత్రించాలన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎస్పీలు, సీఐలు, ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

17 నుంచి ధాన్యం కొనుగోళ్లు

నరసన్నపేట: జిల్లాలో ఈ నెల 17 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి తెలిపారు. నరసన్నపేటలోని వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో వీఏఏ, వీహెచ్‌ఏలకు రబీ సీజన్‌పై ఒక రోజు శిక్షణ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తేమ 18 శాతానికి మించకూడదన్నారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ డీడీ భవానీశంకర్ మాట్లడుతూ కొంత మంది వీఏఏలు బాధ్యతగా పనిచేయడం లేదని, తీరు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త చిట్టిబాబు, ఏడీఏలు కృష్ణారావు, రవీంద్రభారతి, వ్యవసాయాధికారులు చిరంజీవీ, కె.సునీత, కె.సురేష్ పాల్గొన్నారు.

మందస ఎస్ఐ సస్పెన్షన్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలోని మందస పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఖాదర్‌బాషాపై శాఖపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు బుధవారం రాత్రి డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మల్కన్‌గిరి: లైట్‌హౌస్ ప్రాజెక్టుతో విద్యార్థులు



మల్కన్‌గిరి: ప్రత్యేక అకర్షణగా నిలిచిన ప్రాజెక్టు



పర్లాకిమిడి: ప్రదర్శనలో ఆకట్టుకున్న మోడల్ గ్రామం



పర్లాకిమిడి: పెద్దకొత్తూరు యూజీహెచ్ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన చెత్తతో కళాఖండాలు

ఉత్సాహంగా బాల వైజ్ఞానిక ప్రదర్శన

- ఆకట్టుకున్న విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు

పర్లాకిమిడి: మహేంద్రగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. వైజ్ఞానిక ప్రదర్శనను గుసాని సమితి విద్యాధికారి (బీఈవో) టి.కిశోర్ బుధవారం ఉదయం ప్రారంభించారు. కార్యక్రమంలో అల్యూమినీ అధ్యక్షులు భాగవత్ పాఢి, ఏబీవో ఎస్.విమల్, ప్రధాన ఉపాధ్యాయులు పూర్ణచంద్ర ప్రధాన్, జ్యూరీ సభ్యులు సాత్విక్ పట్నాయక్, సుర్జిత్ నాయక్, లింగరాజ్ పాఢి, బాలకృష్ణ మఝిలు హాజరయ్యారు. గుసాని సమితిలోని 97 ఉన్నత ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు. బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయం, హైజెనిక్ ఫుడ్, రవాణా, కమ్యూనికేషన్, విపత్తుల నిర్వాహణ, చెత్తతో సంపద, వనరుల నిర్వాహణ, లెక్కల మోడల్స్‌పై ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంపిక చేసిన వాటిని జిల్లా, రాష్ట్ర స్థాయికి పంపిస్తామని బీఈవో టి.కిశోర్ తెలిపారు.



పర్లాకిమిడి: ప్రదర్శన తిలకిస్తున్న న్యాయనిర్ణేతలు

ఆలోచింపజేసిన విజ్ఞాన మేళా

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని దిప్తీ కనివెంట్ స్కూల్‌లో విజ్ఞానమేళాను బుధవారం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. ముఖ్యఅతిథులుగా మలక్‌న్‌గిరి సమితి ఎడ్యుకేషన్ అధికారి రవేంద్రనాథ్ ధర్, మల్కన్‌గిరి కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రోలు హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి విజ్ఞాన సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత సిస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.



పర్లాకిమిడి: రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న బీఈవో టి.కిశోర్, అల్యూమినీ అధ్యక్షులు భాగవత్ పాఢి



మల్కన్‌గిరి: విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ముఖ్యఅతిథి రవేంద్రనాథధర్



మల్కన్‌గిరి: ఎల్‌కేజీ విద్యార్థుల ప్రాజెక్టును పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ అనిత సిస్టర్



పర్లాకిమిడి: వ్యాకమ్ క్లీనర్ ప్రాజెక్టు



పర్లాకిమిడి: సేవ్ ఎనర్జీ సైన్సు ప్రాజెక్టు



మల్కన్‌గిరి: జూ ప్రాజెక్టుతో విద్యార్థులు



పర్లాకిమిడి: గుసాని సమితి స్థాయి విజ్ఞాన ప్రదర్శన బహుమతి ప్రదాన సభలో మాట్లాడుతున్న బాలికృష్ణ మఝి

రుణాల మంజూరుపై అవగాహన

జయపురం: కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా రైతులుకు అందజేయనున్న రుణాలపై బుధవారం అవగాహన కల్పించారు. కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ సభాగృహంలో అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రాహి అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాణిగ్రాహి మాట్లాడుతూ అవిభక్త కొరాపుట్, రాయగడ, కొరాపుట్, మల్కనగిరి, నవరంగపూర్ జిల్లాల్లో గల రైతులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింటిలోనూ రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆర్థిక, సామాజిక ప్రగతికి చేయూత ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చిన రుణాలు తిరిగి వసూలు చేయటంలోనూ అధికారుల భూమిక గురుతరమైనఅన్నారు. బ్యాంక్ కార్యదర్శి అతుల్య కుమార్ మల్లిక్ మాట్లాడుతూ.. రైతులకు రుణాలు ఇచ్చినప్పుడు బ్యాంక్ నియమాలు తుచా తప్పకుండా పాటించాలన్నారు. ఈ వర్క్‌షాపులో బ్యాంక్ సీనియర్ డైరెక్టర్ రమాకాంత రౌళొ, ప్రభుత్వ అధికారి భీమసేన్ సాహు, జయపురం సహకార విభాగ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ మహంతి, జిల్లా వ్యవసాయ అధికారి దయానిది రౌత్, రాయగడ జిల్లా విభాగ డిప్యూటీ డైరెక్టర్ సుధామ్ చంద్ర బిశ్వాల్, కొరాపుట్ జిల్లా విభాగ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ కుమార్ నాయక్, రాయగడ ఏడీఏ త్రివేణి పాత్రో, ఏ.ఎఫ్.ఓ జయపురం సంతోష్ కుమార్ సాహు, ఏపీకోల్ కొరాపుట్ జిల్లా కోఆర్డినేటర్ దేవేంద్ర ప్రధాన్, కొరాపుట్ నవార్డ్ డీడీఎం నవీణ కుమార్ బెహర, మల్కనగిరి జిల్లా ఖొయిరపుట్ సమితి బీడీఓ హరిశ్చంద్ర బొనగాడి, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ ఏడీఎం, జయపురం కేసీసీ బ్యాంక్ అధికారులు, అవిభక్త కొరాపుట్ జిల్లాల కేసీసీ బ్యాంక్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర పాణిగ్రహి

చట్టాలపై అవగాహన

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం ఆధ్వర్యంలో బుధవారం బొయిపరిగుడ సమితి మహుళి గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ సచేతన శిబిరం నిర్వహించారు. న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సచేతన శిబిరం ప్రధాన లక్ష్యం వివరించారు. లైంగిక అపరాధాల నుంచి, శిశు, బాలికలకు సుర‌క్షా, అర్ధాంతరంగా చదువులు మానివేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పేందుకు, మౌలిక సైకర్యాల కల్పన, 14 ఏళ్ల వయసు వారికి చదువుకునే అధికారం, నిర్బంధ విద్యా విధానం అమలుపై అవగాహన కల్పించారు. పిల్లలను పాఠశాలకు పంపకుండా ఇంటి పనులకు, బయట పనులు చేసేందుకు పంపిన తల్లిదండ్రులకు జైలు శిక్షతో పాటు జరిమానా ఉంటుందన్నారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా శిశు సురక్షా అధికారి రాజశ్రీ దాస్, బొయిపరిగుడ బ్లాక్ విద్యాధికారి సుకాంత కర్తని, మహుళి పంచాయతీ సర్పంచ్ శ్రీపద జాని, పంచాయతీ అధికారి రాజ్యశ్రీ సింగ్, పారాలీగల్ స్వచ్ఛంద సేవకులు రాజేశ్వర మహురియ, అనిల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుమన జెన

ధాన్యం సేకరణలో దోపిడీపై నిలదీత



ధాన్యం సేకరణలో సమస్యలు వివరిస్తున్న జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు

పర్లాకిమిడి: ఖరీఫ్‌- 2024 ధాన్యం సేకరణలో రైతుల నుంచి మిల్లర్లు, అధికారులు దోపిడీకి పాల్పడుతున్నారని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ క్వింటాలుకు లోడింగ్, పొల్లు, ఇతర ఖర్చుల రూపంలో భారీగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో బరంపురం ఎంపీ డా.ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహి, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, కలెక్టర్ బిజయకుమార్ దాస్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, సబ్‌కలెక్టర్ అనూప్ పండా, గుసాని జెడ్పీటీసీ జోన్‌-1 ఎస్.బాలరాజు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రఫుల్లకుమార్ బెహారా, ఆర్.ఉదయగిరి మార్కెటింగ్ సొసైటీ అధికారులు, అసిస్టెంట్ కోపరేటివ్ రిజిస్ట్రార్ హరిహర శెఠి తదితరులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న జెడ్పీటీసీ ఎస్. బాలరాజు

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్ అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ జి.పద్మారావు బుధవారం విడుదల చేశా రు. 7785 మంది పరీక్ష రాయగా 2925 మంది ఉత్తీర్ణులయ్యారు. 37.57 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్లో వివరాలు అందుబాటులో ఉంచారు. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని డీన్ సూచించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జరగనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజుతో కలిసి పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు.

సరస్వతీ శిశు విద్యామందిర్ క్రీడా పోటీలు



క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్ 35వ వార్షిక క్రీడా పోటీలను ప్రధాన అచార్యులు సరోజ్ పండా బుధవారం స్థానిక కృష్ణచంద్ర గజపతి కళాశాల మైదనంలో ప్రారంభించారు. రెండు రోజులు జరగనున్న పోటీలకు సీనియర్, జూనియర్ విభాగాలలో ఖోఖో, పరుగు పందెం, సాఫ్ట్ బాల్ త్రో, లాంగ్ జంప్, హైజంప్ తదితర ఈవెంట్లు ఉంటాయని ప్రధాన అచార్యులు తెలిపారు.



వంద మీటర్ల పరుగు పోటీలను ప్రారంభిస్తున్న ప్రధాన ఆచార్యులు సరోజ్ పండా

ఘాటెక్కిన ఉల్లి ధర!

- ధర నియంత్రణకు అధికారుల సన్నాహాలు



భువనేశ్వర్: రాష్ట్రంలో ఉల్లిపాయల ధరలు చుక్కల్ని తాకుతున్నాయి. కిలో 50 రూపాయలపు పైగా పలుకుతోంది. అల్లం ధర కూడా గణనీయంగా పెరిగింది. నిత్యావసర పదార్థాల ధరల పెరుగుదలపై ప్రభుత్వం పట్టు కోల్పోయింది. కార్తీక మాసంలో ఉల్లి వినియోగం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో ధర పెరుగుదల కొనసాగుతుండగా మరి కొన్ని రోజుల్లో కార్తీకం ముగిసి ఉల్లి వినియోగం పెరిగితే ధరల పరిస్థితి ఎలా ఉంటుందోనని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ధరల నియంత్రణకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

నిండుకున్న నిల్వలు..

రాష్ట్రంలో ఉల్లి నిల్వలు నిండుకున్నాయి. గత రబీ సీజన్లో ఉల్లి సాగు తగ్గడంతో దాని ప్రభావం ఇప్పుడు పడింది. ఖరీఫ్‌లో సాగుచేసిన కొత్త పంట ఇంత వరకు అంగడికి చేరలేదు. దీంతో తాత్కాలిక కొరత తలెత్తింది. నిల్వ, వినియోగం వ్యత్యాసంతో ధరల పెరుగుదల అనివార్యమైంది. ప్రధానంగా రాష్ట్రంలో ఉల్లి ఉత్పాదన మొక్కుబడిగా కొనసాగుతున్నందున నిత్యావసరాల కోసం ఇరుగు పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తుందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో తెలిపారు. ఉల్లి ధర పెరుగుదలకు కళ్లెం వేసేందుకు కిలో రూ. 30 చొప్పున విక్రయించాలని నాఫెడ్‌కు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నుంచి రాష్ట్రానికి ఉల్లి దిగుమతి చేసి అవసరాల్ని గట్టెక్కిస్తున్నారు.

అల్లం ధరలు పైపైకి..

మరో వైపు రిటైలు మార్కెట్‌లో అల్లం కిలో ధర రూ. 400కి చేరింది.

ఈ ధరలు మరో ఆరు రోజుల్లో తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఒడిశా వ్యాపారుల మహా సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర పండా ఆశాభావం వ్యక్తం చేశారు.

కొత్త సంవత్సరంలో కొత్త కార్డులు

కొత్త సంవత్సరం జనవరి నెలలో కొత్త రేషను కార్డుల పంపిణీ జరుగుతుందని మంత్రి కృష్ణ చంద్ర పాత్రో తెలిపారు. దొంగ కార్డుల ఏరివేసేందుకు ఈ- కేవైసీ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ప్రక్రియ ఈ ఏడాది జూలై నెలలో ఆరంభమైంది. ఈ ప్రక్రియ ముగియడంతో కొత్త లబ్ధిదారులతో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం అవుతుంది. ఇప్పటి వరకు సాగిన ఈ-కేవైసీ ప్రక్రియలో 16 లక్షల బూటకపు లబ్ధిదారులను తొలగించినట్లు మంత్రి పేర్కొన్నారు.

‘వేదాంత’కు భూముల కేటాయింపు రద్దు



వివరాలు వెల్లడిస్తున్న రెవెన్యు మంత్రి సురేష్ కుమార్ పూజారి

భువనేశ్వర్: రాష్ట్రంలో వేదాంత విశ్వ విద్యాలయం ఏర్పాటు కథ ముగిసినట్లే. ఈ మేరకు సేకరించిన భూముల్ని సంబంధిత యజమానులకు తిరిగి అప్పగించనున్నట్లు రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్‌కుమార్ పూజారి బుధవారం ప్రకటించారు. 2006 జూలైలో ప్రపంచ స్థాయి విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు వేదాంత లిమిటెడ్ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వేదాంత విశ్వ విద్యాలయం పేరుని తొలుత స్టెరిలైట్ ఫౌండేషన్ పేరుతో తొలుత ప్రతిపాదించి తర్వాత అనిల్ అగర్వాల్ ఫౌండేషన్‌గా మార్చింది. ఈ ప్రాజెక్టు కోసం 22 గ్రామాల్లో ప్రజల నుంచి 4,178.84 ఎకరాల భూములను సేకరించారు. దీనిలో ప్రతిపాదిత సంస్థ పేరు మీద ఉన్న 3,342.53 ఎకరాల విస్తీర్ణపు స్థలం స్వాధీనం చేసుకుంది. 692.02 ఎకరాల విస్తీర్ణపు ప్రభుత్వం స్థలం లీజు కోసం దరఖాస్తు చేసింది. అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 509.27 ఎకరాల విస్తీర్ణపు స్థలం లీజుకు మంజూరు చేసింది. సంస్థ ఏర్పాటు కోసం స్థల సేకరణతో ప్రభావితమైన 9 స్థానభ్రంశ కుటుంబాలు రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించాయి. బాధిత వర్గాల అభ్యర్థన నేపథ్యంలో ప్రతిపాదిత ప్రాజెక్టు పేరు తరచు మార్చడం పట్ల రాష్ట్ర హైకోర్టు ఆరా తీసింది. ఇటువంటి చర్యలు విశ్వసనీయతని బలహీనపరుస్తాయనే అభిప్రాయంతో హైకోర్టు ఏకీభవించింది.